# ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం


హుస్నాబాద్ టౌన్ : అనాథ వృద్ధులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 20 : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమని, ప్రతిఒక్కరూ తోటి వారికి సాయం చేయడం అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. బుధవారం బాలవికాస ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ హాజరై మాట్లాడుతూ సమాజంలో వృద్ధాశ్రమాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలవికాస సృష్టికర్త బాలక్క మంచి ఉద్దేశంతో సమాజ సేవ చేసేందుకు సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్ ప్లాంట్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, బాలవికాస కో-ఆర్డినేటర్ జ్యోతి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సంధ్యావళి, కౌన్సిలర్ చిత్తారి పద్మ, బాలవికాస వాటర్ ప్లాంట్ హుస్నాబాద్ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకన్న**

**'మనఊరు- మనబడి' పనుల పరిశీలన..**

హుస్నాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 'మనఊరు –మనబడి' పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు.


బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

## ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

బెజ్జంకి, డిసెంబర్ 20 : శుద్ధమైన ఓటరు జాబితా తయారీకి బీఎల్‌వోలు సహకరించాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ శ్యామ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఓటరు జాబితాపై బీఎల్‌వోలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పాత ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. జనవరి 6న ముసాయిదా ప్రకటించి ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్, అనిల్, రజనీష్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 20 : మద్దూరు మండలం వల్లంపట్లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆలేటి రజితయాదగిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మద్దూరు బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్, పల్లె దవాఖాన వైద్యురాలు ప్రతిభ, ఏఈవో కల్పన, పంచాయతీ కార్యదర్శి మహేందర్, మదానీ ఇండేన్ గ్యాస్ ఉద్యోగి మదార్, ఏఎన్ఎం లలిత, ఆశ వర్కర్లు నీరజ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సరుకుల పంపిణీ

బెజ్జంకి, డిసెంబర్ 20 : మండలంలోని క్రాసింగ్‌లో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 40 మంది వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం, పప్పులు, నూనె, రవ్వ, సబ్బులు, బ్రెడ్ ప్యాకెట్లు, ఇనుప పెట్టె తదితర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దామోదర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 20 : గ్రామాల్లో బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సెక్టోరియల్ అధికారి రంగనాథ్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కాసులాబాద్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, హెచ్ఎంలు రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు విష్ణుప్రసాద్, కృష్ణ, బాల్‌రాజు పాల్గొన్నారు.

## అడ్వెంచర్ క్యాంపునకు డిగ్రీ కళాశాల విద్యార్థి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 20 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అగస్టిన్ ఈనెల 23 నుంచి జనవరి 1 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే జాతీయ అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికయ్యాడని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుసూదన్, కృష్ణయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థి అగస్టిన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 20 : గజ్వేల్ పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా ఆలయంలో వేకువజామున నుండే వేంకటేశ్వర స్వామి, గోదాదేవికి ధనుర్మాస పూజలు నిర్వహించడంతోపాటు పాశురాలను పఠిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో తేలియాడుతున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు శేషం శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుక్క రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

## అధికారులు ఆదర్శంగా ఉండాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 20 : అధికారులు ఇతరులకు ఆదర్శంగా జీవించాలని, తల్లిదండ్రులు, భార్యాపిల్లలను ప్రేమించాలని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) అందె శ్రీనివాసరావు సూచించారు. బుధవారం సిద్దిపేట పట్టణ శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ సిబ్బంది, అధికారులతో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం ఏఆర్ కానిస్టేబుల్ నరేశ్ చనిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబాన్ని, విధి నిర్వహణను సమానంగా చూసుకొని జీవితం గడపాలన్నారు. క్రమశిక్షణ తప్పితే జీవితం ఎలా మారుతుందో సమాజంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. ఆవేశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకొని జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, ఆర్ఐలు ధరణికుమార్, ప్రసాద్, శ్రీనివాస్, రాజేష్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం ఖూనీ

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 20 : పార్లమెంట్‌కు రక్షణ కల్పించడంలో ప్రధాని మోదీ సర్కారు విఫలమైందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదన్నారు. పార్లమెంట్‌పై దాడి విషయంలో ప్రధాని మోదీ, అమిత్‌షా నోరుమెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రశ్నిస్తున్న 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని ప్రజలు బొందపెట్టడం ఖాయమన్నారు.

## ఒకరిపై ఒకరు ఫిర్యాదు

కొమురవెల్లి, డిసెంబర్ 20 : మండలంలోని గురువన్నపేటలో ఉపసర్పంచ్ తుక్కోజి నర్సింహులు కుటుంబ సభ్యులు తనపై దాడి చేశారని బుధవారం సర్పంచ్ నిర్మల భర్త పరశురాములు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు స ర్పంచ్ భర్త తన అనుచరులతో కలిసి తన ఇంటికి వచ్చి తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఉపసర్పంచ్ నర్సింహులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఉపసర్పంచ్ కుమారుడి వ్యక్తిగత విషయానికి సంబంధించిన ఆడియోను గ్రామానికి సంబంధించిన గ్రూపుల్లో షేర్ చేయడంతో సర్పంచ్, ఉపసర్పంచ్ కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరిగినట్లు సమాచారం.

## తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

వర్గల్, డిసెంబర్ 20 : వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా గ్రూపుల్లో మతపరమైన, రాజకీయపరమైన, కులపరమైన తప్పుడు పోస్టులు పెడితే సైబర్ నేరం కింద చట్టపరమైన చర్యలు తప్పవని గౌరారం, బేగంపేట ఎస్సైలు విజయ్‌భాస్కర్, అరుణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రేపు విస్తృత స్థాయి సమావేశం

బెజ్జంకి, డిసెంబర్ 20 : తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఈనెల 22న బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

# ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకోవాలి

చేర్యాల, డిసెంబర్ 20 : ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని గమ్యం చేరేవరకూ కృషిచేయాలని తమిళనాడు కేడర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభినవ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగపురి గ్రామానికి చెందిన అభినవ ప్రవీణ్‌కుమార్ బుధవారం స్వగ్రామానికి వచ్చారు. సందర్భంగా ఆయన చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యం లేకుండా ముందుకు సాగితే సాధించేది ఏమీ ఉండదని, విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. తాను ఇదే పాఠశాలలో 7వ తరగతి వరకు అభ్యసించానని, తర్వాత బండారుపల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్ సంతోషీకరుణాకర్, హెచ్ఎం ఐలయ్య, ఉపసర్పంచ్ ప్రజ్ఞాపురం ఎల్లేష్, ఎస్ఎంసీ చైర్మన్ ప్రజ్ఞాపురం నర్సింహులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అభినవ ప్రవీణ్‌కుమార్

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం


ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లత, ప్రజాప్రతినిధులు

తొగుట, డిసెంబర్ 20 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. 15 ఫైనాన్స్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్లు, మరో రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీటీసీ సామి పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 20 : శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయశాఖమంత్రి రాందాస్ అథ్వాలేను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసినవారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాపయ్య, గుర్రాల శ్రీనివాస్, శంకర్, చిన్నబాబు, యాదగిరి ఉన్నారు.


కేంద్రమంత్రి రాందాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

# జాతీయ స్థాయి పోటీలకు గజ్వేల్ విద్యార్థినుల ఎంపిక

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 20 : గజ్వేల్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. డిసెంబర్ 21 నుంచి 24 వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే 29వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులు పాల్గొనున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థినులను పాఠశాల ప్రత్యేకాధికారి అనురాధ, పీఈటీ జ్యోతి, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

**జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక..**

బెజ్జంకి, డిసెంబర్ 20 : మండలంలోని బేగంపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఎగోళం నిహారిక 67వ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో జాతీయ స్థాయికి నిహారిక ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 2 నుంచి 5 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే క్రీడాపోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు వివరించారు. విద్యార్థి నిహారికను సర్పంచ్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ స్రవంతి, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, పీఈటీ సతీశ్‌కుమార్, ఎఎంసీ చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.


జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులతో పీఈటీ జ్యోతి